పామాయిల్ కొరత..!

పూర్తి స్థాయిలో అందుబాటులో లేని నూనె

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సామాన్యుడి నూనెగా భావించే పామాయిల్ కొరత మార్కెట్‌లో నెలకొంది. పామాయిల్ కావాలంటే ఇప్పుడు అనేక షాపుల్లో వెతుక్కునే పరిస్థితి ఉంది. ఎక్కడా పూర్తి స్థాయిలో ఆ నూనె అందుబాటులో లేదు. ఇతర నూనెలు అవసరమైన మేరకు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. పామాయిల్ మాత్రం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా తగినంత స్టాకు ముందులా ఉండటం లేదు.

అనంతలో రోజుకు వంద టన్నుల వరకు అవసరం

దేశంలో వినియోగించే నూనెల్లో అత్యధికం పామాయిల్‌యే ఉంటుంది. ఇది ఎక్కువ శాతం మలేసియా నుంచి ఇండియాలోకి వచ్చేది. కొన్ని నెలలుగా దిగుమతిలో కొంత అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో పామాయిల్ దిగుమతులు తగ్గాయి. అంతకు మునుపు పూర్తి స్థాయిలో ఈ నూనె అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సామాన్య ప్రజలు ఎక్కువగా ఈ నూనెను వంటలకు వాడుతుంటారు. ఒక్క అనంతపురం నగరంలోనే ఈ నూనె రోజుకు వంద టన్నుల వరకు అమ్మకాలు సాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు అందుబాటులో పది టన్నులు కూడా లేకుండా ఉంది. పామాయిల్ కావాలంటే నాలుగైదు షాపులు తిరిగితేగాని దొరకడం లేదు. హోటళ్లు, పెళ్లిళ్లు, ఇతర పెద్దపెద్ద వంటలన్నింటికీ ఈ నూనెనే వాడుతూ వచ్చేవారు. ఇప్పుడు ఈ నూనె లేకపోవడంతో ప్రత్యామ్నాయంపై చూస్తున్నారు.

రోజుకు నలభై, యాభై బాక్సులు పోయేవి

రోజుకు తన వద్దనే నలభై నుంచి యాభై బాక్సులు పామాయిల్ నూనె కిలో పాకెట్లు పోయేవి అని నగరంలోని గాంధీబజారులో నూనే వ్యాపారం చేసే వ్యాపారి ఒకరు తెలిపారు. ఇప్పుడు స్టాకు ఆర్డర్ పెట్టినా వెంటనే రావడం లేదు. జులై 27వ తేది పామాయిల్ స్టాకు కోసం ఆర్డర్ పెడితే ఆగస్టు 6వ ఆరవ తేది వరకు కూడా రాలేదని ఆయన తెలిపారు. అయితే పొద్దుతిరుగుడు నూనె, వేరుశనగ నూనెలు అవసరమైన మేరకు స్టాకు ఉందని, దీంతో ప్రజలకు పెద్దగా సమస్య లేకుండా ఉందని ఆ వ్యాపారి తెలిపారు. ధరల్లోనూ వ్యత్యాసం ఏమీ రాలేదని అన్నారు. పెద్ద పెద్ద ఫంక్షన్‌లు, హోటళ్లకు ఎక్కువగా పామాయిల్‌ను వినియోగించే వారు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

జాడలేని వాకింగ్ ట్రాక్..!

దారికి ఇరువైపులా అమత్ పథకం కింద వేసిన కంచె

- చెరువులు, పార్కుల అభివృద్ధికి రూ.94లక్షలు
- అమృత్ 2.0నిధులు మంజూరు
- అట్టహాసంగా పనులు ప్రారంభించిన నాటి ఎమ్మెల్యే
- చెరువు కట్టపై ముళ్లను తొలగించి..
- 300మీటర్ల కంచె వేసి నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి-పెనుకొండ

అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమత్) 2.0 పథకం కింద మున్సిపాలిటీలలో అభివృద్ధికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిధులను మంజూరు చేశారు. గృహాలకు కుళాయిల ద్వారా నీటిని అందించడం, మురుగునీటిని శుద్ధి చేయడం, నీటి వనరులను పరిరక్షించడం, వర్షపు నీటిని నిల్వ, భూగర్భ జలాలను రీఛార్జ్ చేసి నీటి వనరులను పరిరక్షించడం, పట్టణ ప్రాంతాలలో జీవన నాణ్యతను మెరుగుపరచడం కోసం పార్కులను అభివృద్ధి కార్యక్రమాలను చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా పెనుకొండ మున్సిపాల్టీలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.0.94 కోట్లను అమత్ 2.0 పథకం కింద గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే శంకరనారాయణ ఈ పనులను అట్టహాసంగా భూమిపూజ చేసి ప్రారంభించారు. అయితే ఈ పనులను పూర్తి స్థాయిలో చేయకుండా కేవలం కట్టపై ముళ్ల చెట్లను తొలగించి 300మీటర్ల కంచె వేసి గుత్తేదారు నిధులు దుర్వినియోగంకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

భోగసముద్రం చెరువు పునరుజ్జీవనంకు నిధులు మంజూరు

పెనుకొండ భోగసముద్రం చెరువు పునరుజ్జీవనం కోసం 2023లో అమత్ 2.0 కింద రూ.0.94 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 40శాతం కేంద్రం వాటా, 50శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా, 10 శాతం మున్సిపాలిటీ వాటాగా ఉంది. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చెరువు అభివద్ధికి ఈ నిధులు ఖర్చు చేయాలి. గుత్తేదారు కేంద్రం వాటా నిధుల మేరకే బిల్లులు చేసుకుని పనులను పూర్తి చేయకుండా అసంతృప్తిగా వదిలేశారు.

చెరువుకట్టపై ముళ్లను తొలగించి.. 300మీటర్ల కంచె వేసి నిధులు దుర్వినియోగం

2023 సెప్టెంబర్ 20న అప్పటి ఎమ్మెల్యే శంకరనారాయణ గుత్తేదారులతో కలిసి వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. చెరువు కట్టపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించి చెరువులోపల 300 మీటర్ల కంచె వేశారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేయకపోగా కేవలం కంచ మాత్రమే వేసి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్రం వాటా రూ.37.60 లక్షలు బిల్లులు చేసుకుని గుత్తేదారు పనులను అసంతృప్తిగా వదిలేశారు. కేవలం 300 మీటర్లకు రూ.37.60 లక్షలు నిధులు ఖర్చు చేయడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వకపోవడంతో ఆగిని అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 50శాతం నిధులు మంజూరు చేయకపోవడంతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం ఆగినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా విడుదల చేస్తేనే మున్సిపాల్టీ వాటా 10శాతం మంజూరు చేసే అవకాశం ఉంది. దీంతో భోగసముద్రం చెరువు అభివృద్ధి వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులు అర్థాంతరంగా ఆగాయి.

'రికార్డుల్లేవు...మాకు తెలీదు'

'అమత్ 2.0 కింద పెనుకొండ నగర పంచాయతీలో భోగసముద్రం చెరువు అభివృద్ధి వాకింగ్ ట్రాక్ నిర్మాణంకు నిధులు మంజూరైన విషయం మాకు తెలియదు... ఇందుకు సంబంధించిన రికార్డులే లేవు' అంటూ సంబంధిత అధికారులు చెబుతున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం భూమి పూజ చేసే సమయంలో అప్పటి కమిషనర్ సైతం పాల్గొన్నారు. మున్సిపాలిటీ వాటాగా 10శాతం నిధులు మంజూరు చేయాల్సిన అధికారులకు ఈ విషయమే తెలియదనడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై అప్పటి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వంశీకృష్ణ భార్గవ్‌ను అడగగా ఈ పథకానికి సంబంధించిన రికార్డులు కార్యాలయంలో ఉన్నాయని ఆయన తెలిపారు.

పాత సిసి రోడ్డుకు ఇరువైపులా కంచె

రాష్ట్ర విభజనానంతరం గత టిడిపి ప్రభుత్వ పాలనలో భోగసముద్రం చెరువులో సీసీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బికె.పార్థసారథి నిధులు మంజూరు చేశారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో భాగంగా గుత్తేదారు సిసి రోడ్డుకు ఇరువైపులా 300 మీటర్లు కంచెను వేసి ట్రాక్ నిర్మాణం చేసినట్లు బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం కంచవేసి నిధులను దుర్వినియోగం చేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వ్యవహారం అంతటిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దర్యాప్తు చేసి నిధులు దుర్వినియోగం చేసిన వారందరిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాత సిసి రోడ్డుకు పక్కన వేసిన మెస్ కంచె

వాకింగ్ ట్రాక్ భూమిపూజ చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఛైర్మన్ ఉమర్ ఫరూక్ (ఫైల్‌ఫొటో)

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

భూ సేకరణను వేగవంతం చేయండి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియలో భాగంగా సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను పొందిన తరువాత సమగ్ర నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ గ్రామసభలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఉపయోగాలు, ప్రజల భాగస్వామ్యాన్ని వివరించాలన్నారు. తద్వారా భూ సేకరణ ప్రక్రియ సులభంగా ఉంటుందన్నారు. ఎక్కడైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నెడ్ క్యాప్ అధికారులు, సోలార్ పవర్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.1.10కోట్లతో సిసి కెమెరాలు

సత్యసాయి ట్రస్ట్ సాయం అభినందనీయం : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే, మాజీ మంత్రి, రత్నాకర్‌ను సత్కరిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలు పురస్కరించుకుని పట్టణంలో రూ.1.10కోట్లతో అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాటుకు సత్యసాయి ట్రస్టు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. గురువారం సుందరీకరణ పనులకు భూమి పూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గం అభివద్ధి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బాబా శతజయంతి వేడుకలను రాష్ట్ర పండుగల నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని అందుకు ఆయన వెంటనే జీవో ఇచ్చారన్నారు. బాబా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జోయ్ అలుకాస్ కంపెనీ ప్రతినిధులను స్థానికులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు బెస్త చలపతి, పిసి.గంగన్న, టిడిపి నాయకులు మహమ్మద్ రఫీ, సామకోటి ఆదినారాయణ, ఓబులేసు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను బిగిస్తూ ప్రజలపై తీవ్ర భారాలు మోపుతోందని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రజా సంఘాల ఆద్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకూ ప్రజలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తక్షణం స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమం ఉధతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూసిఐ జిల్లా కార్యదర్శి గిరీష్, ఆర్ ఎస్ పి శ్రీనివాసులు, ప్రజాసంఘాల నాయకులు రంగనాయకులు, సంజీవరాయప్ప, తిమ్మక్క, నారాయణ, కీర్తి, మున్నా, పూజిత, ప్రసూన్, ముస్లిం నగరా అధ్యక్షులు ఉమ్మర్ ఫరూక్, కాంగ్రెస్ నాయకులుఅమరుల్లా, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంపలు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో పాతర్లపల్లి గ్రామ సమీపంలో పాత వేరుశెనగ మిల్లు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లకంపలను అధికారులు తొలగించారు. 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో లైన్ ఇన్స్‌పెక్టర్ మస్తాన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లకంపలను గురువారం తొలగించారు. ఓ పక్కకు ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను జెసిబి సాయంతో సరిచేస్తామని ఆయన చెప్పారు.

బైపాస్ రోడ్డు పూర్తితో తొలగిన ఇబ్బందులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన బైపాస్ రోడ్డు పూర్తితో ప్రజల ఇబ్బందులు తొలగాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం కదిరి పట్టణం కౌలేపల్లి వద్ద బైపాస్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ కదిరిలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో కదిరి కి వచ్చిన చంద్రబాబు బైపాస్ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారని అప్పట్లోనే కార్యరూపం దాల్చిందని అన్నారు. అనంతరం అధికారం కోల్పోవడంతో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిహారం విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో ఇన్నిరోజులు కొంత జాప్యం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులతో మాట్లాడి కోర్టులో కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చొరవ తీసుకున్నారన్నారు. దీంతో 226 కోట్ల రూపాయలతో చేపట్టిన బైపాస్ పనులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీసా బహుద్దీన్, వైస్ ఛైర్‌పర్సన్ సుధారాణి, రాజశేఖర్ ఆచారి, టిడిపి నాయకులు పివి పవన్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, తదితరులు

చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చేనేతల అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. ధర్మవరం పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మంత్రితో పాటు టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ టిఎస్.చేతన్‌తో పాటు చేనేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా శివానగర్‌లోని నేతన్న విగ్రహానికి నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతపురం ఏర్పాటు చేసిన చేనేతల బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. చేనేతలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగా హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలియజేశారు. చేనేత వస్త్రాలపై విధించే జీఎస్టీని భరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలియజేశారు. నేతన్నకి ఏడాదికి రూ.25వేల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని, ఇది చేనేత కార్మికులకు మేలు చేసే అంశం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ చేనేత నాయకులు సందా రాఘవ, గిర్రాజు నాగేష్, జింకా రామాంజనేయులు, సంకరాపు జయశ్రీ, కూటమి నేతలు జింకా చంద్ర శేఖర్, డోలా రాజారెడ్డి, పరిసే సుధాకర్, కమతం కాటమయ్య, నాగూర్ హుస్సేన్, అంబటి సతీష్, సరితలా దస్తగిరి, డిష్ రాజు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్, తహశీల్దార్ సురేష్ బాబు, విఆర్ఓ రవిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నేతన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి, కూటమి నాయకులు, కలెక్టర్

అడిగింది ఇచ్చుకో.. రిజిస్ట్రేషన్ చేసుకో...

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయం

వివాదాస్పదంగా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ తీరు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఏ ప్రాంతంలో ఏ వివాదంలో ఉన్న భూములైనా చిలమత్తూరులో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేయడం పరిపాటిగా మారింది. గతంలోను పెనుకొండ ప్రాంతంలో వివాదాస్పద భూమిని రిజిస్ట్రేషన్ చేసిన గత సబ్ రిజిస్టర్ పై వేటు పడింది. ఆ స్థానంలో వచ్చిన ప్రస్తుత సబ్ రిజిస్ట్రర్ ప్రసాద్ బాబు తానేమీ తీసిపోను అన్నచందంగా తయారయ్యాడు. హిందూపురం లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నా ఎనీవేర్ అంటూ వివాదాస్పద భూములను చిలమత్తూరు లో రిజిస్ట్రేషన్ చేయడం, గతంలో వారి చేతుల్లో మోసపోయిన బాదితులు గొడవకు దిగడం ముందస్తుగానే పోలీసులతో కార్యాలయం అష్టదిగ్బదం చేసి మోసపోయిన బాధితులను కార్యాలయం వద్దకు రానివ్వకపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఎక్కడైన తమపై అధికారుల ఆదేశాలు అంటారు. కాని ఇక్కడ ఈయన తీరు అందుకు విరుద్ధంగా ఉంది. 'ఎమ్మెల్యే కార్యాలయం వారు చెప్పారు చేస్తున్నాం' అంటూ విలేకర్లకు చెప్పడంతో అందరూ కంగుతిన్నారు. వివాదాస్పదం అని తెలిసి చేయడం వెనుక ఆయన పెద్ద మొత్తంలోనే డిమాండ్ చేసి తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బుధవారం కార్యాలయం సమయం అయిపోయిన తర్వాత జరిగిన రిజిస్ట్రేషన్ పై ఉన్నత అధికారులు విచారణ చేపట్టాలని అలాగే బుధవారం సాయంత్రం రిజిస్ట్రేషన్ జరిగిన విదానంపై సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలోని సిసి టీవి పుటేజీలు తీసుకోవాలని పోలీసుల అతి ఉత్సహం పై జిల్లా ఎస్పీ పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సత్యసాయి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం కదిరి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సత్య సాయి నీటి సరఫరా పథకం కార్మికుల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జివిల్ నరసింహులు, జేఏసీ యూనియన్ నాయకులు వెంకటేష్, శ్రీను, రామ్మోహన్ రెడ్డి, రామకష్ణ, చంద్రమోహన్, ఉత్తప్ప, అశోక్, లక్ష్మయ్య నాయక్, మోహన్ శర్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు 4 నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అధికారులను మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినా ఫలితం కన్పించలేదన్నారు. విధి లేని పరిస్థితులలో11 నుండి సమ్మెలోకి వెళుతున్నారన్నారు. 14 రోజలు ముందే సమ్మె నోటీసు ఇచ్చినా అధికారులు మాట్లాడిన పరిస్థితి కూడ లేదన్నారు. సత్యసాయి నీటి సరఫరా పథకము ద్వారా సుమారు 1000 గ్రామాలకు, 10 లక్షల మంది ప్రజలకు 540 మంది కార్మికులు తాగునీటిని అందిస్తున్నారన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ పిల్లల చదువుల ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. పైప్ లైన్ వెంబడి తిరిగే ఖర్చులకు చేతిలో డబ్బులు లేక డ్యూటీలు కూడ చేయలేకపోతున్నట్లు పేర్కొన్నారు. విధి లేని పరిస్థితులలో ఈనెల 11 నుండి సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు.14 రోజులు ముందే సమ్మె నోటీసు ఇచ్చినా సత్యసాయి కార్మికులతో అధికారులు చర్చించడం లేదని విమర్శించారు. బాబా 100వ జయంతి, ప్రజల నీటి అవసరాలను గుర్తించమని కార్మికులకు మాత్రమే చెబుతున్నారని అధికారులు గుర్తించి నిధులు కేటాయించి వేతనాలు ఇస్తే ప్రజలకు నీటిని సరఫరా చేయగలమని అన్నారు. ప్రభుత్వం గత సంవత్సరం 33 కోట్ల రుపాయలు కేటాయిస్తే 2025 ఫిబ్రవరి నాటికే సరిపోయిందన్నారు. ఈ సంవత్సరము కేవలం 13.7 కోట్ల రుపాయలు మాత్రమే కేటాయించారని నెలకు కోటి రుపాయలు మాత్రమే కేటాయించి, 2025 ఏప్రిల్ నుండి నిధులు విడుదల చేయలేదని అన్నారు. పథకము పాతదయ్యే కొద్దీ నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయని రాష్ట్ర స్థాయి అధికారుల నిర్లక్ష్యమో,ప్రభుత్వ పెద్దల అశ్రద్ధనో సత్యసాయి నీటి పథకము పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బాబా ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. పాలకులు, అధికారులు స్పందించి కేటాయించిన బడ్జెట్ నుండి వెంటనే నిధులు విడుదల చేసి 4 నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పథకం సక్రమ నిర్వహణకు అవసరమయ్యే బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వము కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

బత్తలపల్లి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న సత్యసాయి కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఈ నెల 11 నుండి సమ్మె చేపడతామని సత్యసాయి కార్మికులు హెచ్చరించారు. సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు జగన్ మారుతి, రఘుపతి,భాష, అనంతయ్య,మల్లేష్, జయరాం తదితరులు మాట్లాడుతూ సత్యసాయి నీటి పథకము కార్మికులకు 4 నెలలుగా వేతనాలను చెల్లించలేదన్నారు. ఈ విషయమై అధికారులు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో తప్పని పరిస్థితిలో సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ బాలకృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. ఈ ఉచిత గుండె చికిత్స శిబిరం తమకు ఎంతో ఉపయోగపడిందని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి మడకశిర టౌన్

పట్టణ పరిధిలో ప్రతి ఎలక్షన్ వార్డులో స్వచ్ఛ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ప్రతి వార్డులో వార్డు కౌన్సిలర్ స్వచ్ఛ కమిటీకి చైర్మన్ గా వ్యవహరించనున్నారన్నారు. సచివాలయం సంబంధించి ఇంజినీరింగ్, శానిటేషన్, మహిళా పోలీస్, ఏ ఎన్ ఎం, శాఖల సెక్రెటరీలు, ఆర్పీ లు స్వచ్ఛ అంబాసిడర్లుగా వ్యవహరిస్తారన్నారు. ప్రతి వీధి నుండి ఒక స్వచ్ఛ అంబాసిడర్ ను ఏర్పాటు చేసి వారి ద్వారా వీధులలో పరిశుభ్రత ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. పట్టణ ప్రజలు సహకరించి స్వచ్ఛ మడకశిర కు తమ వంతు కృషి చేయాలని కమిషనర్ కోరారు.

కళా ఉత్సవ్ పోటీలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకే ప్రభుత్వం కళా ఉత్సవ్ పోటీలను నిర్వహిస్తోందని డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. 2025 సంవత్సరం గాను ఉమ్మడి జిల్లాలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువు అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీలు 12 విభాగాల్లో జరుగుతాయనితెలిపారు. ఆగస్టు 31వ తేదీ లోపల జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామనిజిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు తమ పేర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

మండల పరిధిలోని మామిళ్లకుంట్లపల్లి, తోట్లవారిపల్లిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైసిపి నాయకులు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మోసం బాబు నైజం అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి , భయపరెడ్డి, చింతా రామచంద్ర రెడ్డి, బాబా, రామస్వామి రెడ్డి, నారాయణరెడ్డి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నర్సింగ్ నందు డిగ్రీ పట్టా కలిగిన వారికి జర్మనీ భాష లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఆసక్తి గల యువత ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారిత అధికారి రెడ్డి బాలాజీ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బి ఎస్ సి పూర్తి చేసి క్లినికల్ అనుభవం కలిగిన ఎస్సీ, ఎస్టి మహిళలు 35 సంవత్సరాలు లోపు వయసుగల వారు అర్హులన్నారు. జర్మనీ భాషలో శిక్షణ అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ 8 నుంచి 10 నెలల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల మహిళలు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్పోర్టు సైజు ఫోటోలు, నర్సింగ్, డిగ్రీ, ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తులను పుట్టపర్తి లోని షెడ్యూల్ కులాల సంక్షేమ సాధికారిక కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

బాలికల హాస్టల్‌లో ఫ్రెషర్స్ డే

లేపాక్షి : స్థానిక బీసీ బాలికల హాస్టల్ నందు గురువారం ఫ్రెషర్స్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా మహాత్మా జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా వార్డెన్ సరస్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు శ్రీనివాస్ రెడ్డి, నలినాక్షి, ఉపాధ్యాయిని నందిని, సిబ్బంది రెడ్డమ్మ,నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డేలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ;; PENUKONDA

E.A.21/2021 in E.P.31/2010 in O.S 186/1980

Between:

K.Nanjappa Since Deceased

Rep by his LRs **...PETITIONER-PLAINTIFF**

AND

M.Chinna Hanumaih and others

...RESPONDANTS-DEFENDANTS

పై నెంబరులో అర్జీలోని 19,20 ప్రతివాదులకు నోటీసు

TO,

R19: Vanaja W/o Late K.Gopal
Pydeti, Parigi mandalam

R20: Ramya D/o Late K.Gopal
Pydeti, Parigi mandalam

యిందుమూలకముగా మీకు తెలియచేయడమేమనగా పై నెంబరు అర్జీలో మిమ్మలను 19,20 ప్రతివాదులుగా చేర్చుటకు గాను అర్జీదాఖలు చేసినారు. సదరి విషయములై మీకు ఏమైనా అక్షేపణలు వున్న ఎడల మీరు 12-08-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గానీ వకీలు ద్వారా గాని హాజరై మీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెయును లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానము చేయుదురని యిందు మూలకముగా మీకు తెలియచేయడలమైనది.

(By the order of the Court)

ఆర్.శ్రీకాంత్‌రెడ్డి,
అర్జీదారుల పరం వకీలు, పెనుకొండ

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ లోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు గ్రాడ్యుటి సౌకర్యం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ప్రమోషన్ కల్పించే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈసందర్భంగా నూతన ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మణిమాల, ప్రధాన కార్యదర్శిగా రంగమ్మ, మినీ అంగనవాడి యూనియన్ లీడర్‌గా భారతి ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ ,స్వర్ణ, సరళ, సునీత భాయ్, షమీం తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కదిరి పట్టణం పులివెందుల రోడ్ లోని అంగన్వాడీ ప్రాజెక్టు లో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత వైసిపి ప్రభుత్వంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. ఈ సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి అవుతున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీల వేతనాలు పెంచాలన్నారు. అదేవిధంగా కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2జి ఫోన్లు ఇచ్చి రకరకాల యాప్ ల పేరుతో ఇబ్బందులకు గురవుతున్నారని ఈ ఫోన్లతో విసిగిచెంది అంగన్వాడీలు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పారని అన్నారు. ప్రభుత్వం నాణ్యమైన ట్యాబ్లు ఇవ్వాలని అన్ని సేవలకు సంబంధించి ఒకే యాప్ ను రూపొందించాలని కోరారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహలు , అంగనవాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, మాబున్నీసా, శ్రీదేవి, సుశీల, సుజాత, రామలక్ష్మి, వకుల, మాధవి , సిఐటియు నాయకులు జగన్మోహన్ , బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

సర్వ శిక్ష అభియాన కింద నిర్వహిస్తున్న భవిత కేంద్రాలను వికలాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కిష్టప్ప, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవరాజు తెలిపారు. కొత్త చెరువులోని సత్య సాయి భజన మందిరంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగ విద్యార్థుల్లోని అంగవైకల్యం గుర్తించి ఏ పరికరాలు అవసరము వాటిని డాక్టర్లు గుర్తించారన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ కోసం ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నామని వీటిని తల్లిదండ్రులు వారి పిల్లలకు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ జయచంద్ర, సోమశేఖర్ నాయుడు, సహిత విద్య సమన్వయకర్త ఆనంద్ బాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిటిసి సూపర్వైజర్ అబీద్ భాషా పేర్కొన్నారు. గురువారం కొత్తచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోతులకుంట గ్రామంలో క్షయ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం నాగజ్యోతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు గురువారం హిందూపురం పురపాలక సంఘం పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, సెర్ప్ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 100 అడుగులతో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 వ తేదీన ప్రతి ఇంటి పైన జాతీయ పతాకాన్ని ఎగరవేసి, దేశ సమైక్యతను, సమగ్రతను చాటుకోవాలని, దేశాభిమానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎంసి ఎల్.గంగులయ్య, సెర్ప్ ఎ.పి.యం. జి.రామాంజినేయులు, సి.ఓ.లు తౌసిఫ్, నాగేంద్ర, సదానంద, వరలక్ష్మి గంగరత్న, డి.ఈ.ఓ. ఇబ్రహీం ఖాన్, పట్టణ సమాఖ్య ఓ.బి.లు, అన్ని సమాఖ్యల ఆర్.పి.లు, సెర్ప్ విఒఎలు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తదితరులు

చేనేతను ఆదుకోవాలి

గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

చేనేతలను ఆదుకోవాలని ఎపి చేనేత కార్మికసంఘం నాయకులు కోరారు. జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా ధర్మవరం పట్టణంలో ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్. బాషా మాట్లాడుతూ చేనేత కార్మికులకు కూటమిప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముద్ర రుణాలను ఎటువంటి షరతులు లేకుండా గుర్తింపు కార్డు ఉన్నవారందిరికి ఇవ్వాలన్నారు, హ్యాండ్లూమ్స్ కు 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రతి మగ్గం చేసే కార్మికునికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి మూడు సెంట్లు స్థలం ఇచ్చి వర్క్ షెడ్డు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు., రాష్ట్ర ప్రభుత్వం చేనేత బడ్జెట్ 2000 కోట్లు కేటాయించాలి, చేనేత కార్మికులకు సొంత స్థలం ఉంటే 6 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలి. ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయం ధర్మవరంలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఖాదర్ బాషా, గుంపు హరి, జెవి రమణ, అయూబ్ ఖాన్, ఆదినారాయణ, వెంకటస్వామి, నరేష్, తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్,దౌల, రాజు, నరసింహ, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్ఎస్‌పిఆర్ విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్ పి ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎ. మదీహా, రాష్ట్రస్థాయి వకృత్వ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభా విద్యార్థినిని ప్రిన్సిపల్, అధ్యాపకులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కళాశాల, యన్ ఆర్ సి, జోనల్ స్థాయిలలో సమాచార హక్కు చట్టం-2005 పై జరిగిన పోటీలలో వరుసగా ప్రథమ స్థానంలో నిలిచిన మహీదా ఈనెల 11వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి వకృత్వ పోటీలలో పాల్గొంటున్నదన్నారు. బుధవారం సైతం కడపలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో ఈమెతో పాటు డిబేట్లో ద్వితీయ స్థానం సాధించిన కళాశాల బీ యస్సి విద్యార్థిని గౌతమి, క్విజ్ పోటీలలో తృతీయ స్థానం సాధించిన బిఎస్సి విద్యార్థులు శ్రీనిధి, తనూష, నిహారిక లను కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు,అధ్యాపకులు శ్రీధర్, భోజప్ప,ఎల్ ఆర్ రమేష్, ప్రకాష్ రావ్, రవి నాయక్, అశ్వర్థప్ప, నసీమ భాను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి నరసింహులు అభినందించారు.

ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

ఎస్ఐ తీరుపై జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు ఎస్ఐ నరేంద్ర తీరుపై స్థానిక జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కొందరు ఘర్షణకు పాల్పడ్డారన్న కారణంతో కొందరు వ్యక్తులను స్టేషన్‌కు తరలించారన్నారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకు స్టేషన్ వదకు వెళ్లిన పాత్రికేయులపై ఎస్ఐ నరేంద్ర దురుసుగా ప్రవర్తించినట్లు చెప్పారు. 'లోపలికి రాకండి.. ఇక్కడ మీకు ఏం పని' అంటూ 'ఇక్కడినుండి వెళ్లండి' అంటూ దురుసుగా ప్రవర్తించాడన్నారు. ఇది జర్నలిస్టుల హక్కులపై కాలరాసే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్, శ్రీధర్ రెడ్డి, నరసింహా రెడ్డి, విశ్వనాథ్, సురేంద్ర రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేస్తున్న విలేకరులు

చిత్రావతి సుందరీకరణకు భూమిపూజ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చిత్రావతి సుందరీకరణకు జాయ్ అలుకాస్ సంస్థ రూ.1.20 కోట్లు వితరణ చేసిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చిత్రావతి సుందరీకరణ పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు పుట్టపర్తిలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా సుందరీకరణ పనులకు జాయ్ అలుకాస్ ఫౌండేషన్ వారు రూ.1.20 కోట్లు వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబా శతజయంతి ఉత్సవాలకు తమ వంతుగా ఆ ఫౌండేషన్ వారు నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. ఈ పనులు రెండు నెలల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ శతజయంతి ఉత్సవాలకు ప్రభుత్వం కూడా ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోయాలుకాస్ ఫౌండేషన్ ప్రతినిధులు జియో మాథ్యూస్, గణేష్, డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్డీవో సువర్ణ, కమిషనర్ క్రాంతి కుమార్, ఇరిగేషన్ ఈ ఈ సుధాకర్ రాజు, జమునా భాయి, మాజీ మున్సిపల్ చైర్మన్లు బెస్త చలపతి, పీసీ గంగన్న, నాయకులు సామకోటి ఆదినారాయణ, మహమ్మద్ రఫీ, ఓబులేసు, గుట్లపల్లి గంగాద్రి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

యానిమేటర్లపై నమోదైన కేసు కొట్టివేత

కేసు కొట్టివేత అనంతరం మీడియాతో మాట్లాడుతున్న లాయర్, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

2019లో వైసీపీ ప్రభుత్వం 20 మంది ఐకెపి యానిమేటర్ల మీద పెట్టిన కేసును అనంతపురం కోర్టు గురువారం కొట్టి వేసినట్లు సత్య సాయి జిల్లా యూనియన్ నాయకులు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాగా ఉన్నప్పుడు కొత్తగా వచ్చిన వైసీపీ ప్రభుత్వం యానిమేటర్లను తొలగించాలని జీవోను తీసుకువచ్చిందన్నారు. దీంతో యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ని కలవడానికి వెళ్లిన 20 మంది యానిమేటర్లపై అప్పట్లో కేసు నమోదు చేశారన్నారు. దాదాపు ఆరు సంవత్సరాలు పాటు నెలకు రెండు సార్లు వాయిదాలకు తిరిగామన్నారు. చివరకు యానిమేటర్లు ప్రభుత్వానికి ఎటువంటి నష్టం చేయలేదని అనంతపురం స్పెషల్ కోర్టు జడ్జి కేసును కొట్టివేశారని చెప్పారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగ కార్మికుల పట్ల కక్ష పూరిత రాజకీయాలు చేయడంతోనే ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ప్రభుత్వానికి నష్టం చేయాలని కించపరచాలనో పోరాటాలు చేయలేదని అన్నారు. 20 మంది మీద పెట్టిన కేసును ఆరు సంవత్సరాల విచారణ తరువాత కేసును కొట్టివేశారన్నారు. ఈ కేసులో యానిమేటర్ల తరపున వాదించిన లాయర్ శ్రీనివాస్‌కు ఈ కేసులో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వివాహిత హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కోడిగెనహళ్లి పంచాయతీ బిందునగర్ సమీపంలో ఇటీవల జరిగిన సన్నక్క అనే మహిళ హత్య కేసు కు సంబంధించి నాగరాజు అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పెనుగొండ సీఐ రాఘవన్ తెలిపారు.కోడిగినహళ్లి గ్రామానికి చెందిన సనక్క సాయి నగర్ లో జీవనం ఉండేది.తన భర్త నుండి విడిపోయి సుమారు 10 సంవత్సరాలుగా అదే గ్రామానికి చెందిన ఓ యువకుడుతో సహజీవనం సాగిస్తూ మద్యానికి బానిసై అయింది.ఈ తరుణంలో శ్రీరంగరాజుపల్లి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తితో చిన్నపాటి గొడవ కావడంతో దీనిని దృష్టిలో పెట్టుకున్న నాగరాజు రాత్రి వేళలో ఇంటికి వెళ్తున్న సన్నక్కపై కట్టెతో దాడి చేశాడు. ఈ దాడిలో సన్నక్క మృతి చెందడంతో భయాందోళనకు గురైన నాగరాజు కొన్ని రోజులుగా ఇతర ప్రాంతంలో తలదాచుకున్నాడు. ఈ హత్య కేసు పై సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు డిఎస్పి నరసింగప్ప పర్యవేక్షణలో సిఐ రాఘవన్ స్పెషల్ టీం తో విచారణ చేపట్టారు. గురువారం వీఆర్వో ద్వారా ఎస్ఐ రంగడు యాదవ్ కు ముద్దాయి నాగరాజు పట్టుపడ్డాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సిఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల కేంద్రంలోని సంత తోపు వద్ద 42వ నంబర్ జాతీయ రహదారిపై, గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మదనపల్లి నుంచి కదిరి వైపు వస్తున్న బొలెరో వాహనం, కదిరి నుంచి వస్తున్న గ్యాస్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమదంలో బొలెరో వాహన డ్రైవర్ వెంకటకుమార్ మృతిచెందాడు. మృతుడు కర్నాటక రాష్ట్రం చిక్‌బళ్లాపరం దిబ్బరహళ్లి గ్రామనికి చెందిన వాడుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు

దాడి ఘటనలో నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని కే లోచర్ల గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన దాడి ఘటనలో నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు అప్‌గ్రేడ్ సిఐ మారుతి శంకర్ తెలిపారు. లోచర్ల గ్రామానికి చెందిన దళిత దామోదర్ , లక్ష్మయ్య అనే వ్యక్తులు బస్టాండ్ కూడలిలో ఉండగా అదే గ్రామానికి చెందిన కిత్తర నారాయణస్వామి మరో ముగ్గురు కలిసి మద్యం మత్తులో వచ్చి వారితో ఘర్షణపడి దాడి చేసి కులం పేరుతో దూషించారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గుండెపోటుతో సిఆర్ఎంటి మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

సర్వ శిక్ష అభియాన్‌లో సిఆర్ఎంటిగా విధులు నిర్వహిస్తున్న బాబావలి(55) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. విధి నిర్వహణలో భాగంగా మండల పరిధిలోని కొత్త దేవరపల్లి ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన బాబావలి గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్వ శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజు, ఎంఇఓ జయచంద్ర, సోమశేఖర్ నాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాబావలి అంత్యక్రియలకు 15 వేల రూపాయలను మృతుని భార్యకు అందజేశారు. బాబావలి మృతికిఉపాధ్యాయులు నివాళులర్పించారు.

ఆర్డీటీ ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశకి - బత్తలపల్లి

బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆసుపత్రిలో ప్రాణాంతక వ్యాధితో గుర్తుతెలియని రోగి మృతి చెందాడని, అతని పూర్తి వివరాలు తెలియ రాలేదని మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆంజనేయులు(42) అనే రోగిని ఈనెల 2వ తేదీ సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి తీసుకువచ్చి ఆర్డిటి ఎమర్జెన్సీ వార్డులో చేర్చాడన్నారు.ఇక్కడ చికిత్స చేయగా ఆంజనేయులుకు ప్రాణాంతక వ్యాధి(రెట్రో వైరల్ డిసీజ్ వ్యాధి)గా నిర్ధారణ కావడంతో అదే రోజు రాత్రి 9గంటలకు కేర్ అండ్ సపోర్ట్ సెంటర్లోకి మార్చారన్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఆర్డీటీ ఆసుపత్రిలో చేర్పించి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయాడన్నారు. దీంతో వైద్యులు రోగిని స్వస్థలము తల్లిదండ్రుల పేర్లు అడగడానికి ప్రయత్నించగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదన్నారు.తాను ఒక అనాధనని, ఒక ఊరు అంటూ లేదని, ఫుట్‌పాత్‌పై జీవనం సాగించేవాడినని తెలిపాడన్నారు.అతని వద్ద ఎటువంటి ఆధారం లేదన్నారు. తాము అతనికి చికిత్సలు అందిస్తుండగా వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి 5వ తేదీ మతి చెందాడన్నారు. మృతుని వివరాలు తెలిసి ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

జోనల్ స్థాయి పోటీలకు లేపాక్షి విద్యార్థులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలో ని సిరివరం తారక రామ జిల్లా పరిషత్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆపాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ తెలిపారు. వంద మీటర్ల పరుగు పందెం లో మైత్రి, షాట్ పుట్ విభాగం లో ప్రణీత్ కుమార్, మంజునాథ్ ఎంపికయ్యారన్నారు. ఈసందర్భంగా వీరిని సన్మానించారు. తిరుపతి లో జరిగే జోనల్ స్థాయి లో కూడా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిత్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు

ప్రజాశక్తి - చిలమత్తూరు

పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని చెన్నమ్మను సింగిల్ విండో అధ్యక్షురాలిగా ఎంపిక చేయడం ఇందుకు నిదర్శనమని టిడిపి నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మాజీ సర్పంచ్ ఆర్. చెన్నమ్మ సింగిల్‌విండో అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ ప్రెసిడెంట్‌గా చంద్రారెడ్డి, డైరెక్టర్‌గా సోమశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి. రమేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నమ్మ 24 ఏళ్లుగా పార్టీకి సేవలందించారని, బీసీలకు టిడిపీలో ప్రాధాన్యం ఉందనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ జయరాం, టిడిపి కోఆర్డినేటర్ రంగారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, లక్ష్మీనారాయణ యాదవ్, మండల కన్వీనర్ శ్రీనివాసులు, మల్లికార్జున, శ్రీదేవి, నందీశప్ప, గౌరీ శంకర్, తిప్పారెడ్డి, బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. ఈ సందర్భంగా గురువారం కమిషనర్ తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిందూపురం పురపాలక సంఘ పరిధిలో ఇప్పటికే అనధికార లేఅవుట్లు గుర్తించడం జరిగిందన్నారు. అనధికార లేఔట్లను లేదా అందులో ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో గురువారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. ఉదయభాస్కర్ ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రారెడ్డి, ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ వాయల్పాడు హిదయతుల్లా ఆధ్వర్యంలో జిల్లా బాస్కెట్ బాల్ బాలికల, బాలుర జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా ప్రాధికారక సంస్థ ఆధ్వర్యంలో ఈ జట్లను గురువారం బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన పోటీల ఆధారంగా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్లు త్వరలో జోనల్ స్థాయిలో తిరుపతి నగరం నందు జరిగే బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. ఉదయభాస్కర్, బాస్కెట్బాల్ అసోసియేషన్ ప్రతినిధులు శెట్టిపి జయచంద్రారెడ్డి, వాయల్పాడు హిదయతుల్లా, శాప్ కోచ్ హసన్, సీనియర్ క్రీడాకారులు ప్రకాష్ తదితరులు అభినందించారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా

పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన మానవహారం

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పిడి కె ప్రమీల ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి తల్లిపాలు ప్రాముఖ్యతను నినాదాలతో తెలియపరుస్తూ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి మాట్లాడుతూ తల్లి పాలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఎం అండ్ హెచ్ఒ ఫిరోజ్ బేగం, సిడిపిఒలు జయంతి, గాయత్రి , డిసిపిఒ మహేష్, జిల్లా కోఆర్డినేటర్ సుధీర్ వర్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, మెప్మా సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు, విజ్ఞాన్ నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పిల్లలకు తల్లిపాలు ఇవ్వటం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ దరిచేరదని సిడిపిఒ రాధిక తెలిపారు . ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం భాగంగా ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రిపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. తల్లిపాలు త్రాగే పిల్లల్లో రోగనిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, లక్ష్మీదేవి, దీప కళావతి, జయశ్రీ, నరసమ్మ ,మమత తదితరులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్ :మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్వాడి కార్యకర్తలు సిబ్బందితో తల్లిపాల వారోత్సవాల్ని నిర్వహించారు సిడిపిఒ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శ్రీదేవి,ఉష రాణి, పద్మ, అంగన్వాడి కార్యకర్తలు సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ఒబులదేవర చెరువు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక మహమ్మదాబాద్ క్రాస్ ఐసిడిఎస్ కార్యాలయ పరిధిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, సావిత్రమ్మ, గంగాదేవి ఆధ్వర్యంలో ఓ డి సి, నల్లమాడ, అమడగూరు మండలాల అంగన్వాడి కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ స్వామినాథన్ శతజయంతి

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

పట్టణంలోనిసిఐటీయూ కార్యాలయంలో భారత హరిత విప్లవ పితామహుడు డాక్టర్. ఎం ఎస్ స్వామినాథన్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి,సిఐటీయూ నాయకులు మాట్లాడుతూ హరిత విప్లవ సృష్టికర్త స్వామినాథన్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ మండల కార్యదర్శి బాబావలి, నాయకులు మహబూబ్ బాషా, వెంకటేశులు, నాగమ్మ, లక్ష్మి నరసమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : డాక్టర్ స్వామినాథన్ 100వ జయంతిని నల్లచెరువు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం జిల్లా సభ్యులు తిరుమల కొండ శ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.స్వామినాథన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, మండల రైతు సంఘం కార్యదర్శి వెంకట స్వామి రైతులు పాల్గొన్నారు.

స్వామినాథన్ చిత్రపటానికి నాయకుల నివాళి

స్పెషల్ గ్రీవెన్స్‌లో అర్జీల వెల్లువ

పెనుకొండలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసిన స్పెషల్ గ్రీవెన్స్‌లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ అర్జీలను సమర్పించుకున్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అందని అర్హులకు అర్జీలు సమర్పించినట్లు ఎంపీడీవో రాంకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌ఉదయ శంకర్ రాజ్, ఏవో రాజేష్, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు మాధవ నాయుడు, నరహరి, చిన్నప్పయ్య, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో గురువారం స్పెషల్ గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతి, ఎంఈఓ ఆంజనేయులు నాయక్, ఏవో విజయభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, తదితర సంక్షేమ పథకాలు లబ్ధిదారులుగా ఉండి కొన్ని సాంకేతిక సమస్యల వల్ల వారి అకౌంట్లో నగదు జమ కాలేదన్నారు. వారి కోసం ఈ గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో మాజీ జడ్పీటీసీ రంగేపల్లి వెంకటరమణ,వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ డి.వి.ఆంజనేయులు, టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశులు,మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప,హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, మాగే చెరువు సర్పంచి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకం పై గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం, తల్లికి వందనం పథకం రాని రైతులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు స్పెషల్ గ్రీవెన్స్‌లో అర్జీలు సమర్పించారు. మండల వ్యాప్తంగా తల్లికి వందనంపై 93 ఫిర్యాదులు, అన్నదాత సుఖీభవ పై 122 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ,మండల కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వర ప్రసాద్, రాష్ట్ర యాదవ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, గుట్టూరు సూర్యనారాయణ, సిద్దయ్య, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, రఘు, రామలింగ, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- పరిగి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అధికారులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పరిగి మండల వ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు, వ్యవసాయ శాఖ అధికారులు, సెక్రటరీలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి మండల ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిగి మండల వ్యాప్తంగా ఇటు రైతులకు అటు విద్యార్థులకు ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం నిధులపై సమీక్ష సమావేశంలో చర్చించారు. ఎంపీడీవో రెడ్డప్ప మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో కొంతమంది అర్హులైనప్పటికీ ఎన్పీసీఐ, మరిన్ని సమస్యల వల్ల అర్హులైనప్పటికీ నిధులు జమ కాలేదని అలాంటి వారిని గుర్తించి వారి సమస్యలు పరిష్కారానికి త్వరితగతిన పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయభాస్కర్, ఎఒ శ్రీకృష్ణ, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, మండల నాయకులు కన్వీనర్ గోవింద్ రెడ్డి మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ మాజీ ఎంపీటీసీ సోమప్ప సర్పంచ్ బాలాజీ శాసనకోట వెంకటేష్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

ప్రజాశక్తి - తాడిమర్రి

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని గురువారం మండల గ్రంథాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి సీనా నాయక్ రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

లేపాక్షి: స్థానిక గ్రంథాలయంలో విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున, సిబ్బంది మంజునాథ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది కవిత, చంద్రకళ, నరసింహులు పాల్గొన్నారు.

వైసిపి నేతపై దాడి శోచనీయం

ప్రజాశక్తి-హిందూపురం

పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల ప్రచారంలో వైసీపీ సీనియర్ నాయకుడు, రమేష్ యాదవ్ పై టిడిపి నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ గురువారం హిందూపురం బీసీ సంఘాల నేతలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, తాలూకా వైసిపి బీసీ నేతలు హిందూపురం పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి వినతి పత్రం సమర్పించారు.బీసీ నేత రమేష్ యాదవ్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా పరిపాలన ప్రక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగంతో పరిపాలిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు గడ్డం రామకృష్ణ, వైసీపీ కౌన్సిలర్ శివ, మండల వైసీపీ కన్వీనర్ సంతేబిదనూర్ రాము, మహిళా నాయకురాలు నాగమణి, సర్పంచి ఆనంద్, నాయకులు వాల్మీకి లోకేష్, వరుణ్, సల్మాన్, మనోజ్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష అభ్యున్నతికి ముందుకు రావటం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుభాష అభ్యున్నతిలో లేపాక్షి ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని గురువారం పట్టణంలోని బాలయేసు కళాశాలలో వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష పట్ల లేపాక్షి ఫౌండేషన్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ వడ్డి సుధాకర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీ సత్యసాయి విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని డివిడిబిఎస్ విద్యాలయ క్రీడా ప్రాంగణంలో లగోరి జిల్లా స్థాయి జట్ల ఎంపిక గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ ఎంపికలకు దాదాపు 250 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. లగోరి క్రీడ ప్రాచీనమైనదని లగోరి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్ర జట్టు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17వ తేదీన మైదుకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ కరస్పాండెంట్ భీమరాజు, రఘునందన్ గుప్తా, మల్లికార్జున, సాయి స్వరూప్, శివ, సునీల్ కుమార్, శైలజ, లోకేశ్వర్, సావిత్రి, అరుణ తదితరులు పాల్గొన్నారు.